

అమ్మవారిని దర్శించుకున్న డిప్యూటీ సీఎం సతీమణి నందిత, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి కోట నీలిమ

ఎల్లమ్మ సన్నిధిలో ప్రముఖులు

అమీర్‌పేట: బల్కంపేట ఎల్లమ్మ ఆలయాన్ని బుధవారం పలువురు ప్రముఖులు సందర్శించి..అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. డిప్యూటీ సీఎం సతీమణి నందిత, మాజీ ఏఐసీసీ సభ్యురాలు, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి కోట నీలిమ, టీజేఎస్ అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం, సనత్‌నగర్ మాజీ ఎమ్మెల్యే కాట్రగడ్డ ప్రసూన,కాంగ్రెస్ నాయకురాలు కల్వ సుజాత తదితరులు రథోత్సవంలోనూ పాల్గొన్నారు. ఈ సందర్భంగా టీపీసీసీ ప్రధాన కార్యదర్శి కోట నీలిమ మాట్లాడుతూ ఈ ఏడాది ఎల్లమ్మ కల్యాణోత్సవాల్లో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. మంత్రులు కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్ ఆధ్వర్యంలో ఉత్సవాలు దిగ్విజయంగా జరిగాయన్నారు.



అమ్మవారిని దర్శించుకున్న కోదండరాం



వాహనాల తిష్ట

అక్రమ పార్కింగ్.. స్పందించరేం?

అధికారుల పర్యవేక్షణ లేక ఫ్లై ఓవర్ల కింద అక్రమ పార్కింగ్‌లకు అడ్డాగా మారుతున్నాయి. తార్నాక, లాలాపేట ఫ్లై ఓవర్ల పొడవునా కింది ప్రాంతాల్లో పాడైన వస్తువులు, వాహనాలు, పాత ఇనుప సామాన్లు, మరో వైపు చెత్త డంపింగ్‌లతో ఆ ప్రాంతాలన్నీ స్క్రాప్ గోడౌన్‌లను తలపిస్తున్నాయి. ఇదే అదనుగా భావించిన కొందరు ఫ్లై ఓవర్ కింద స్థలాలను ఆక్రమించి టిఫిన్ సెంటర్లు,టీ స్టాళ్లు, మెకానిక్ షెడ్లులతో చెలరేగిపోతున్నారు. ప్రభుత్వ స్థలాల్లో అక్రమంగా ఏర్పాటు చేసిన వీటికీ సైతం కొందరు అద్దెలు వసూలు చేస్తుండటం గమనార్హం.

–లాలాపేట

- అసాంఘిక కార్యకలాపాలకు నిలయం
- రాకపోకలకు ఇబ్బందులు
- దృష్టి సారించని అధికారులు



ఫ్లై ఓవర్ కింద అక్రమంగా పార్క్ చేసిన కార్లు

నగరంలోని ఫ్లై ఓవర్‌ల కింద ఎలాంటి కార్యకలాపాలు నిర్వహించకుండా నగరవాసులకు ఆహ్లాదం, కనువిందు కోసం పచ్చదనం, పూలమొక్కలు ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగానే తార్నాక–లాలాపేట ఫ్లై ఓవర్ కింద భాగంలో పచ్చదనం ఏర్పాటు కోసం చేసిన ప్రతిపాదనలు కాగితాలపైనే మిగిలిపోయాయి. జీహెచ్‌ఎంసీ అధికారులు అటువైపు కన్నెత్తి చూసిన పాపాన పోలేదు. దీంతో ప్రస్తుతం ఈ ప్రాంతంలో పాడైన వాహనాలు, తుప్పుపట్టిన కార్లు, మోటర్లకు కేంద్రంగా మారింది. దీనికి తోడుగా కొందరు మెకానిక్‌ల పేరుతో ఫ్లై ఓవర్ కింద రోడ్డును పూర్తిగా ఆక్రమించేశారు. నడిరోడ్డుపై కార్లను పెట్టి మెకానిక్ పనులు చేస్తున్నారు. దీంతో నాచారం, ఎర్రకుంట, హనుమాన్‌నగర్ నుంచి వెళ్లే వాహనదారులు ఈ మార్గంలో రాకపోకలు సాగించలేకపోతున్నారు. ఇదే మార్గంలో నిత్యం ప్రస్తుత జీహెచ్‌ఎంసీ డిప్యూటీ మేయర్, మాజీ మేయర్‌లు సైతం రాకపోకలు సాగిస్తున్నా ఈ అక్రమ పార్కింగ్‌పై స్పందించపోవడం బాధాకరమని స్థానికులు చర్చించుకుంటున్నారు.

ఒంటరిగా వెళ్లాలంటే భయం..

బ్రిడ్జి క్రింద ప్రాంతంలో పార్క్ చేసిన వాహనాల మధ్య కొందరు రాత్రి వేళల్లో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారు. గంజాయి, మద్యం తాగడం, పేకాట వంటి అనేక సంఘ వ్యతిరేఖ పనులకు తెర లేపుతున్నారు. ఇటీవలే లాలాగూడ పోలీసులు ఫ్లై ఓవర్ కింది జనప్రియ అపార్టుమెంట్ ముందు ప్రాంతంలో గంజాయి విక్రేతలను అరెస్టు చేసిన సంఘటనలు ఉన్నాయి. దీంతో ఈ ప్రాంతం నుంచి మహిళలు, చిన్నారులు ఒంటిరిగా వెళ్లడానికి భయపడుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి ఈ సమస్యపై దృష్టి సారించాలని కోరుతున్నారు.

1400 పడకల ఆసుపత్రి నిర్మాణానికి కృషిచేస్తా

కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్



ఆసుపత్రి నిర్మాణ వివరాలను తెలుసుకుంటున్న ఎమ్మెల్యే శ్రీ గణేష్

రసూల్‌పురా: కంటోన్మెంట్ బొల్లారంలో నిర్మిస్తున్న అల్వాల్ టిమ్స్ సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రిలో 1400 పడకల ఆసుపత్రి నిర్మాణం చేపట్టేందుకు సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లనున్నట్లు ఎమ్మెల్యే శ్రీగణేష్ అన్నారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో కంటోన్మెంట్ బొల్లారం పరిధిలో రూ.897 కోట్ల వ్యయంతో చేపట్టిన తెలంగాణ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (టిమ్స్) అల్వాల్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణ పనులను ఎమ్మెల్యే శ్రీగణేష్ బుధవారం పరిశీలించారు. ఆసుపత్రి, అనుబంధ బ్లాక్‌ల నిర్మాణం ప్రస్తుతం నిర్మాణ పనులు ఎంతమేరకు పూర్తయ్యాయి, నిధుల విడుదల తదితర వివరాలను ఎమ్మెల్యే ఆర్అండ్‌బీ ఇంజనీరింగ్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం 1200 పడకల ఆసుపత్రి నిర్మాణ జరుగుతోందని దీన్ని 1400 పడకల ఆసుపత్రిగా నిర్మాణం జరిగేలా సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లనున్నట్లు తెలిపారు. ఈ ఆసుపత్రి నిర్మాణం పూర్తయితే పరిసర నాలుగైదు జిల్లాల ప్రజలకు కార్పొరేట్ వైద్యం అందుబాటులోకి వస్తుందని చెప్పారు.ఎమ్మెల్యే వెంట అధికారులు స్థానిక నేతలు జైప్రకాష్, నరసింహ కన్నన్, బాల్ రాజు, సరిత తదితరులు పాల్గొన్నారు.

శంకర్ యాదవ్ సేవలు చిరస్మరణీయం

ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్



అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్

బన్సీలాల్‌పేట్: మోండా మార్కెట్ వర్తకుల సంఘం అధ్యక్షులు దివంగత తలసాని శంకర్ యాదవ్ సేవలు చిరస్మరణీయమని ఆయన సోదరుడు, ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. మోండా మార్కెట్‌లో బుధవారం కోత్ మీర్ మధు అధ్వర్యంలో శంకర్ యాదవ్ జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడారు. చిల్లర వర్తకులు, వ్యాపారుల హక్కులతో పాటు వారి అభివృద్ధికి శంకర్ యాదవ్ చేసిన సేవలు మరువలేనివన్నారు. మోండా మార్కెట్‌లో అనేక సమస్యల పరిష్కారంలో పాటు అభివృద్ధికి ఎంతో కృషి చేశారన్నారు. శంకర్ యాదవ్ ఆశయాల, స్ఫూర్తితో మోండా మార్కెట్ సమగ్రాభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో శంకర్ యాదవ్ సోదరులు నర్సింగ్ యాదవ్, మహేష్, ధరం, సైకిలాబ్, కుమారుడు శివలాల్, నాయకులు ఆకుల హరిక్రిష్ణ, నాగులు, అత్తెల్లి శ్రీనివాస్ గౌడ్, శేఖర్, జయరాజ్ పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ పరిధిలోని సైఫాబాద్ పీజీ కాలేజీలో వివిధ సబ్జెక్టులను బోధించేందుకు పార్టుటైం లెక్చరర్ (పీటీఎల్) ఉద్యోగాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. కెమిస్ట్రీ–3, స్టాటిస్టిక్స్, ఇంగ్లిష్, జూవాలజీ–2, బయో టెక్నాలజీ, తెలుగు, సంస్కృతం, కంప్యూటర్ సైన్స్, ఎన్విరాన్‌మెంట్ సైన్స్‌లో–1 పోస్టులకు అర్హత గల అభ్యర్థులు ఈ నెల 18 వరకు దరఖాస్తు చేసుకోవాలని మరిన్ని వివరాలకు 8985279013 సంప్రదించాలని ప్రిన్సిపల్ ప్రొ.లక్ష్మణ్ నాయక్ తెలిపారు

వార్డు కార్యాలయంలో 'ప్రజాపాలన'



ప్రజా సమస్యలు తెలుసుకుంటున్న సుభాష్‌రావు, కంది శైలజ

బౌద్ధనగర్: బౌద్ధనగర్‌లోని జీహెచ్‌ఎంసీ వార్డు కార్యాలయంలో బుధవారం నిర్వహించిన ప్రజాపాలనలో డీసీ సుభాష్ రావు, కార్పొరేటర్ కంది శైలజ పాల్గొని దరఖాస్తులను స్వీకరించారు. ప్రజా సమస్యలను తెలుసుకొని వాటిని పరిష్కరించేందుకు ప్రజాపాలన ఎంతగానో ఉపయోగపడుతుందని డీసీ సుభాష్‌రావు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ ఒమర్, బీఆర్‌ఎస్ నేత మంద జగన్ తదితరులు పాల్గొన్నారు.

పాలస్తీనా ప్రజలపై ఇజ్రాయిల్ దాడులు ఆపాలి

ఉస్మానియా యూనివర్సిటీ: యుద్ధం పేరుతో పాలస్తీనా ప్రజలపై ఇజ్రాయిల్ దాడులను ఆపాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. బుధవారం ఓయూ ఆర్ట్స్ కాలేజీ పొలిటికల్ సైన్స్ విభాగం సెమినార్ హాలులో ఓయూ పీహెచ్‌డీ, పీజీ విద్యార్థుల ఆధ్వర్యంలో యుద్ధాన్ని వ్యతిరేకిద్దాం అనే అంశం పై సదస్సు జరిగింది. కార్యక్రమానికి పీహెచ్‌డీ స్కాలర్ ఆజాద్ అధ్యక్షత వహించగా పౌర హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఓయూ విశ్రాంత అధ్యాపకులు ప్రొ.గడ్డం లక్ష్మణ్, ప్రొ.కాశీం పాల్గొని ప్రసంగించారు. గత వంద సంవత్సరాలుగా సామ్రాజ్య వాదుల చేతిలో నలిగిపోతున్న పాలస్తీనలో యుద్ధం కారణంగా ఇంత వరకు 17000 మంది చిన్న పిల్లలు, 40 వేల మంది ప్రజలు మరణించారని ఆవేదన వ్యక్తం చేశారు. పాలస్తీన ఎప్పటికి పాలస్తీనదే అని యుద్ధం లేని సమాజం కోసం పోరాడాలన్నారు. ఈ కార్యక్రమంలో అఖిల్, యాదగిరి, సత్య, పరమేష్, శ్రవణ్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

అన్నదానాలు



ఈఎస్ఐ వద్ద అన్నదానం చేస్తున్న క్లబ్ ప్రతినిధులు

సనత్‌నగర్: లయన్స్ క్లబ్ ఫాస్ట్ డిస్ట్రిక్ గవర్నర్ వెంకటనారాయణ రెడ్డి జన్మదినం సందర్భంగా లయన్స్ క్లబ్ ప్రతినిధులు సనత్‌నగర్‌లోని ఈఎస్ఐ ఆస్పత్రి వద్ద బుధవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఆస్పత్రికి వచ్చిన రోగుల సహాయకులు, బాటసారులకు అన్నదానం చేశారు. లయన్స్ క్లబ్ నాగోలు మెట్రో కార్యదర్శి రాజశేఖర్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ గవర్నర్ కృష్ణప్రసాద్, ట్రాన్స్‌కో గణాంకాధికారి, లయన్స్ క్లబ్ సభ్యులు క్లెం శ్రీనివాస్‌రెడ్డి, వెంకట నారాయణ రెడ్డి, ఇన్నారెడ్డి, కృష్ణారెడ్డి, రవీందర్, సామ్యూల్ పాల్గొన్నారు.

అమ్మవారి భక్తులకు..



అన్నదానం చేస్తున్న రాము

అమీర్‌పేట: బల్కంపేట ఎల్లమ్మ కల్యాణ వేడుకల్లో భాగంగా రథోత్సవం రోజూ పలు చోట్ల అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. బీకేగూడకు చెందిన టీ స్టాల్ నిర్వాహకుడు రాము రెండు రోజులుగా కల్యాణోత్సవానికి వస్తున్న భక్తులకు అన్నదానం చేశారు.

శ్రీమాతా సేవా సమితి ఔదార్యం



వీల్‌చైర్లు, వస్త్రాలు అందజేస్తున్న సమితి సభ్యులు

సనత్‌నగర్: శ్రీమాతా సేవా సమితి దివ్యాంగులను అవసరాలను తీర్చి మరోసారి ఔదార్యాన్ని చాటుకుంది. నిత్యావసరాలు, చక్రాల కుర్చీలు, వస్త్రాలు, స్టాండ్‌లను అందజేశారు. సనత్‌నగర్ డివిజన్ పరిధిలోని ఆదిత్యానగర్ కమ్యూనిటీహాల్‌లో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో నగరంలోని వివిధ ప్రాంతాలకు చెందిన పలువురు దివ్యాంగుల కుటుంబాలకు మూడు నెలలకు సరిపడా నిత్యావసర వస్తువులు, వీల్‌చైర్లు, వస్త్రాలను అందజేశారు. శ్రీమాతా సేవా సమితి వ్యవస్థాపకులు కుసుమ విజయ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో అమ్మ ప్రేమ సమితి ప్రతినిధులు కట్ట విజయ, సీహెచ్. కుమారి, ఎస్.జెర్సీలు తమవంతు సహకారం అందించారు. ఈ కార్యక్రమానికి ట్రాన్స్‌కో అసిస్టెంట్ అకౌంట్స్ అధికారి క్లెం శ్రీనివాస్‌రెడ్డి, 1104 యూనియన్ నాయకులు సర్వేష్, లయన్స్ క్లబ్ నాగోలు మెట్రో కార్యదర్శి ఎం.రాజశేఖర్, ఆదిత్యానగర్ కాలనీ ప్రధాన కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీమాతా సేవా సమితి చేస్తున్న సేవా కార్యక్రమాలను వారు ప్రశంసించారు. కార్యక్రమంలో సభ్యులు శోభారాణి, వసంత, కమల, రాధిక తదితరులు హాజరయ్యారు.

ప్రజా ఫిర్యాదులకు సత్వర పరిష్కారం



డీసీతో సమావేశమైన కార్పొరేటర్

సికింద్రాబాద్: ప్రజల నుంచి వార్డు కార్యాలయాలకు అందే ఫిర్యాదులను సత్వరమే పరిష్కరిస్తున్నామని జీహెచ్‌ఎంసీ సికింద్రాబాద్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ డి.సుభాష్‌రావు చెప్పారు. బుధవారం సీతాఫల్‌మండి వార్డు కార్యాలయంలో వార్డు కార్యాలయ అడ్మినిస్ట్రేటివ్ అధికారి సంధ్య, సీతాఫల్‌మండి కార్పొరేటర్ సామల హేమ వివిధ విభాగాల అధికారులు సమావేశమయ్యారు. ప్రజల నుంచి అందుతున్న ఫిర్యాదులు అధికారులు స్పందిస్తున్న తీరుకు సంబంధించి సమావేశంలో సమీక్షించారు. అనంతరం జీహెచ్‌ఎంసీ, జలమండలి అధికారులతో కలిసి కార్పొరేటర్ బ్రాహ్మణబస్తీలో పర్యటించారు. బస్తీలో కలుషితజలాలు, రహదారుల సమస్యలు ఉన్నాయని స్థానికులు ఫిర్యాదు చేయగా ఆయా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను కార్పొరేటర్ కోరారు.

'డీఎస్సీ పరీక్ష వాయిదా డిమాండ్ తగదు'

ఉస్మానియా యూనివర్సిటీ: డీఎస్సీ పరీక్ష వాయిదా కోరడం తగదని నిరుద్యోగ జేఏసీ చైర్మన్ ఓరుగంటి కృష్ణ బుధవారం పేర్కొన్నారు. రాష్ట్రం ఏర్పడిన తర్వాత పది సంవత్సరాల అనంతరం మొదటి సారిగా జరుగుతున్న డీఎస్సీ పరీక్ష వాయిదాతో నిరుద్యోగులు నష్టపోతారన్నారు. గత కొన్ని సంవత్సరాలుగా చదువుతున్న విద్యార్థులకు ఉద్యోగాలు లేక కుటుంబాలను పోషించలేక అనేక ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ప్రస్తుతం డీఎస్సీ పరీక్షకు రాసి, ఎక్కువ ఉద్యోగాలకు పోస్టుల సంఖ్యను పెంచాలని మరో డీఎస్సీ కోసం పోరాడదాం అన్నారు. బీఆర్‌ఎస్ పార్టీ నేతలు నిరుద్యోగం పేరుతో రాజకీయాలు చేయడం దారుణమన్నారు. అధికారంలో ఉన్న పది సంవత్సరాలు ఒక్క డీఎస్సీ నోటిఫికేషన్ కూడా ఇవ్వని మాజీ మంత్రులు కేటీఆర్, హరీష్‌రావు ఓయూలో దీక్ష చేస్తామనడం విడ్డూరంగా ఉందన్నారు.

పార్లమెంటులో బీసీ బిల్లు ప్రవేశపెట్టాలి: ఆర్.కృష్ణయ్య

హిమాయత్‌నగర్: పార్లమెంటులో బీసీ బిల్లు ప్రవేశపెట్టి, చట్ట సభలలో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం త్వరలో చేపట్టబోయే జనాభా గణనలో బీసీ కుల గణన చేపట్టాలన్నారు. బుధవారం బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో జాతీయ బీసీ సంక్షేమ సంఘం కన్వీనర్ గుజ్జకృష్ణ ఆధ్వర్యంలో బీసీ మేధో మదన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు రాష్ట్ర కన్వీనర్ లాల్‌కృష్ణ అధ్యక్షత వహించగా వివిధ యూనివర్సిటీల నుంచి పలువురు ప్రొఫెసర్లు, 28 బీసీ సంఘాలు, 36 కుల సంఘాలు, 48 ఉద్యోగ సంఘాల నాయకులు పాల్గొన్నారు. సదస్సులో కాంగ్రెస్ సీనియర్ నేత వి.హనుమంతరావు, బీసీ సంఘాల నేతలు గొరిగె మల్లేష్, ఎర్ర సత్యం, గుజ్జ సత్యం,వేముల రామకృష్ణ, మహిళ నాయకురాలు మట్ట జయంతి గౌడ్‌లతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల నుంచి బీసీ నాయకులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

కాచిగూడ: మున్నూరుకాపు విద్యార్థుల నుంచి 2023–24వ సంవత్సరానికి గాను ప్రతిభా పురస్కారాలకు దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు కాచిగూడ మున్నూరుకాపు విద్యార్థి వసతి గృహం ట్రస్టుబోర్డు చైర్మన్ ప్రొఫెసర్ మ్యాడం వెంకట్‌రావు తెలిపారు. ఎస్ఎస్‌సీ, ఇంటర్‌మీడియట్‌లో 80 శాతానికి పైగా మార్కులు సాధించిన ప్రతిభావంతులైన విద్యార్థినీవిద్యార్థులు దరఖాస్తులు దరఖాస్తులను ఈ నెల 31వ తేదీ లోగా కాచిగూడలోని ట్రస్టుబోర్డు కార్యాలయంలో అందజేయాలన్నారు. వివరాలకు సెల్: 94916 27404 .

ఎర్రగడ్డ రైతుబజార్‌లో కూరగాయల ధరలు

సనత్‌నగర్: టమాటా రూ.43, నల్లవంకాయ 28, పొడుగు వంకాయ 28, బెండకాయ 40, పచ్చిమిర్చి 65, బజ్జీమిర్చి 45, క్యాప్సికమ్ 65, పచ్చకాకర 45, పందిరి బీర 38, క్యాబేజీ 33, క్యారెట్ 35, దొండ 35, గుండుబీన్స్ 65, గింజ చిక్కుడు 80, గోకరకాయ 45, కీర 25, దోసకాయ 28, బీట్‌రూట్ 21, ఉల్లిగడ్డ 32, ఆలుగడ్డ 37, చామగడ్డ 35, మొరంగడ్డ 40, కందగడ్డ 55, సొరకాయ 11, పొట్లకాయ 18, అరటి కాయ 11, మునగకాయ 4–5, ముల్లంగి 5–6. ఈ ధరలు గురువారం ఉదయం 9 గంటల వరకు అమలులో ఉంటాయి.

భక్తుల దాహార్తిని తీర్చిన జలమండలి



నీటి బాటిళ్ల పంపిణీని పర్యవేక్షిస్తున్న అధికారులు ప్రభు, హరీష్‌శంకర్

సనత్‌నగర్: మూడ్రోజుల పాటు జరిగిన బల్కంపేట ఎల్లమ్మ కల్యాణోత్సవంలో లక్షలాది మంది భక్తుల దాహార్తిని తీర్చడంలో జలమండలి కీలక పాత్ర పోషించింది. దేవాలయానికి వచ్చే రహదారులతో పాటు గుడి పరిసర ప్రాంతాల్లో ప్రత్యేక వాటర్ క్యాంప్‌లను ఏర్పాటు చేసి భక్తుల దప్పికను తీర్చారు. దాదాపుగా 70,000 వాటర్ బాటిళ్లను భక్తులు అందించారు. భక్తుల దాహార్తిని తీర్చేందుకు 60 మంది జలమండలి సిబ్బంది విధుల్లో పాల్గొన్నారు. హైదరాబాద్ మెట్రోవాటర్ వర్క్స్ అండ్ సీవరేజీ బోర్డు ఆపరేషన్స్–1 డైరెక్టర్ కే విజయారావు, సర్కిల్–2 సీజీఎం ప్రభు, డివిజన్–6 జనరల్ మేనేజర్ హరీష్ శంకర్, డీజీఎం వంశీకష్ణ, మేనేజర్లు హర్షిణి, హిందూజ పర్యవేక్షించారు.

జర్నలిస్టులపై దాడికి ఖండన

సాక్షి,సిటీబ్యూరో: ఉస్మానియా యూనివర్సిటీలో విధి నిర్వహణలో ఉన్న జర్నలిస్టులపై పోలీసుల చర్య అప్రజాస్వామికమని తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు యూనియన్ రాష్ట్ర కార్యదర్శి, రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు కొంపల్లి శ్రీకాంత్ రెడ్డి, హైదరాబాద్ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్ అధ్యక్షులు శివ శంకర్, మేడ్చల్ జిల్లా అధ్యక్షులు గడ్డమీది బాలరాజు ఒక ప్రకటన విడుదల చేశారు. యూనివర్సిటీలో నిరుద్యోగులు చేస్తున్న ఆందోళనను కవర్ చేసేందుకు వెళ్లిన విలేకరిపై పోలీసులు అమానుషంగా ప్రవర్తించడం సిగ్గుచేటన్నారు. జర్నలిస్టులపై దాడులకు పాల్పడిన పోలీసులపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

నివాళి



నివాళులర్పించిన ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్

అమీర్‌పేట: అమీర్‌పేట మాజీ కార్పొరేటర్ నామన శేషుకుమారి వియ్యంకుడు వెంకటేశ్వర శర్మ అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ బుధవారం మోడల్ కాలనీలోని నివాసానికి వచ్చి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట సనత్‌నగర్ డివిజన్ బీఆర్‌ఎస్ అధ్యక్షులు కొలను బాల్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు



జీహెచ్‌ఎంసీ అధికారులను కలిసిన కాంగ్రెస్ నాయకులు

సికింద్రాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరు గ్యారంటీ పథకాలను నియోజకవర్గంలో అర్హులైన లబ్ధిదారులకు అందరికీ అందిస్తామని సికింద్రాబాద్ కాంగ్రెస్ ఇన్‌చార్జి, కంటెస్టెడ్ ఎమ్మెల్యే ఆదం సంతోష్‌కుమార్ చెప్పారు. బుధవారం జీహెచ్‌ఎంసీ కార్యాలయంలో అధికారులకు కలిసి సంక్షేమ పథకాలు ప్రజలకు అందిస్తున్న తీరు గురించి తెలుసుకున్నారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ.. ఆరు గ్యారంటీల్లో భాగంగా అమలు చేస్తున్న ఉచిత విద్యుత్, గ్యాస్ సబ్సిడీ పథకాలను నియోజకవర్గ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆయా డివిజన్ల కాంగ్రెస్ నాయకులు లబ్ధిదారులతో వార్డు కార్యాలయాల్లో దరఖాస్తులు చేయించడంతో పాటు, పథకాలు అందేలా చొరవ చూపాలని సంతోష్ కుమార్ కోరారు. ఈ కార్యక్రమంలో జలంధర్ రెడ్డి, అభిషేక్, రవి, చంద్రమోహన్, ప్రతాప్ పాల్గొన్నారు.

కార్మికుల హక్కులను కాపాడాలి: సీఐటీయూ



తుకారాంగేట్‌లో నిరసన తెలుపుతున్న సీఐటీయూ నాయకులు

అడ్డగుట్ట: కేంద్రంలో మూడోసారి అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం కార్మికుల హక్కులను కాపాడేలా కృషి చేయాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. సీఐటీయూ పిలుపుమేరకు దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న కార్మికుల కోరిక దినాన్ని పురస్కరించుకొని బుధవారం తుకారాంగేట్‌లో సీఐటీయూ నేతలు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు అజయ్‌బాబు, ఆర్. మల్లేష్ మాట్లాడుతూ.. బీజేపీ ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలన్నారు. ప్రభుత్వ రంగ సంస్థ ప్రైవేటీకరణను ఆపి, నేషనల్ మానిటైజేషన్ పైప్‌లైన్ రద్దు, బొగ్గు గణులను నేరుగా సింగరేణికి కేటాయించాలన్నారు. తమ న్యాయపరమైన హక్కులను కాపాడే విధంగా బీజేపీ ప్రభుత్వం కృషి చేయాలని లేదంటే దేశవ్యాప్తంగా కార్మిక పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. ఈ ధర్నాలో సీఐటీయూ కమిటీ సభ్యులు నర్సింగ్, శంకర్, రాంచందర్, అశోక్, సిద్ధయ్య, రామచంద్రనాయక్, తాలయ్య, వెంకటేష కృష్ణమోహన్, సైదమ్మ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలి



కాలనీ సమస్యలను వివరిస్తున్న అసోసియేషన్ నాయకులు

లాలాపేట: కాలనీల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని తార్నాక వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు మోహన్‌రావు కోరారు. బుధవారం అసోసియేషన్ కమిటీ బృందం జీహెచ్‌ఎంసీ డిప్యూటీ మేయర్ మోతే శ్రీలతా శోభన్‌రెడ్డిని ఆమె కార్యాలయంలో కలిసి సమస్యలు వివరించారు. తార్నాకలో ఫుట్‌పాత్‌ల నిర్మాణం, తార్నాక చౌరస్తా పునరుద్ధరణతో పాటు తార్నాక ప్రధాన రహదారిలో ఉన్న యూ టర్న్ మధ్య దూరాన్ని తగ్గించడం, పాడైన రోడ్ల నిర్మాణం, రోడ్లపై స్కూల్, కళాశాలల బస్సుల అక్రమ పార్కింగ్, ట్రాఫిక్, వీధి కుక్కల బెడద తదితర సమస్యలను డిప్యూటీ మేయర్‌కు వివరించారు. ఈ సందర్భంగా డిప్యూటీ మేయర్ మాట్లాడుతూ.. సంబంధిత ఆయా విభాగాల అధికారులతో మాట్లాడి తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. త్వరలో అధికారులతో కలిసి కాలనీల్లో పర్యటిస్తామన్నారు. డిప్యూటీ మేయర్‌ను కలిసిన వారిలో ఉదయభాను ప్రసాద్, రామ్మోహన్‌రెడ్డి, ఎం.ఎం హుస్సేన్, హరికుమారి, లక్ష్మీనారాయణ, నిరంజన్‌బాబు, లుబ్నా పాల్గొన్నారు.

'ప్రజాపాలన' తప్పొప్పులను సవరించుకోవాలి



వార్డు కార్యాలయ అధికారులతో మాట్లాడుతున్న నాయకులు

అడ్డగుట్ట: ప్రజా పాలన దరఖాస్తుదారులకు ఇంకా పథకాలు అమలు కాకుంటే వెంటనే స్థానిక వార్డు కార్యాలయాల్లో సవరణలు చేసుకోవాలని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు గంట రాజుసాగర్ సూచించారు. బుధవారం పలువురు కాంగ్రెస్ నేతలు తుకారాంగేట్ ఎంసీహెచ్ క్వార్టర్స్‌లోని వార్డు కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా గంట రాజు సాగర్ మాట్లాడుతూ.. ప్రజాపాలనలో వివిధ పథకాల కోసం దరఖాస్తు చేసుకున్న వారిలో కొందరికి ఇప్పటికీ పథకాలు అమలు కావడం లేదన్నారు. దరఖాస్తు సమయాల్లో జరిగిన తప్పొప్పుల కారణంగా అందరికీ పథకాలు అమలు కాకపోవచ్చన్నారు. అర్హులైన వారు వార్డు కార్యాలయాల్లో సవరణలు చేసుకోవాలన్నారు. ఈ కాంగ్రెస్ నేతలు కొమరమ్మ, కృష్ణ, ప్రభాకర్, లక్ష్మి, రమేష్ ఉన్నారు.